## • సబ్‌స్టేషన్ ఎదుట ఆందోళన



ఆరు నెలలుగా కరెంట్ సరిగ్గా ఉండటం లేదంటూ నాగర్‌కర్నూల్ జిల్లా ఊర్కొండ మండలం జకినాలపల్లి సబ్‌స్టేషన్ ఎదుట ఊర్కొండపేట గ్రామస్థులు, రైతులు ఊర్కొండపేట మాజీ సర్పంచ్ కృష్ణాగౌడ్ ఆధ్వర్యంలో గురువారం సబ్‌స్టేషన్ ఎదుట బైఠాయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ సర్కారు ఏర్పడినప్పటి నుంచి గ్రామంలో కరెంట్ ఎప్పుడు పోతుందో.. ఎప్పుడు వస్తుందో తెలియడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. చిన్నపాటి వర్షం కురిసినా కరెంట్ కోతలు విధిస్తున్నారని విమర్శించారు. అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోకపోతే ఏడీఈ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. విషయం తెలుసుకున్న ఏఈ రమణి, ఎస్సై వీరబాబు అక్కడికి చేరుకొని గ్రామస్థులతో మాట్లాడారు. సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. - ఊర్కొండ

## • రెండో ఏఎన్‌ఎంలను రెగ్యులర్ చేయాలి




నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) కింద 17 ఏండ్లుగా పనిచేస్తున్న తమను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేస్తూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో గురువారం కోఠిలోని కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ కార్యాలయం ఎదుట రెండో ఏఎన్‌ఎంలు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ రాష్ట్ర ఉపకార్యదర్శి నరసింహ మాట్లాడుతూ.. శాశ్వత ఉద్యోగాల కోసం గతేడాది ఆగస్టులో సమ్మె నిర్వహించినప్పుడు కాంగ్రెస్ నాయకులు వచ్చి, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే కచ్చితంగా రెగ్యులర్ చేస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. రెండో ఏఎన్‌ఎంల సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు తోట రామాంజనేయులు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోయిని శ్యామల, సహాయ కార్యదర్శులు పద్మ, జయమ్మ, ఉపాధ్యక్షురాలు హారతి, రాజేశ్వరి, గుణవతి, తమ్మిశెట్టి జయమ్మ, యధాలక్ష్మి, పాయం సరోజ పాల్గొన్నారు. –హైదరాబాద్, (నమస్తే తెలంగాణ)

## • ఏటూరునాగారం ఐటీడీఏ వద్ద గిరిజనుల ధర్నా



ములుగు జిల్లా వాజేడు మండలం సర్వే నంబర్ 11లోని ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేసుకున్న వారికి హక్కు పత్రాలు, విద్యుత్తు సౌకర్యం కల్పించాలని కోరుతూ ఏటూరునాగారం ఐటీడీఏ వద్ద గురువారం సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీ మిడియం బాబూరావు మాట్లాడుతూ నిరుపేదలు గుడిసెలు వేసుకుని ఎనిమిది నెలలు కావస్తుందని, వారికి వెంటనే హక్కు పత్రాలు ఇవ్వడంతోపాటు తాగునీటి వసతి కల్పించాలని డిమాండ్ చేశారు. - ఏటూరునాగారం


# ఎమ్మెల్యేల ఇండ్లను ముట్టడించిన 'ఆశ'లు

## కొల్లాపూర్‌లో మంత్రి జూపల్లి ఇల్లు కూడా.. • హామీలు నెరవేర్చాలని డిమాండ్

నమస్తే తెలంగాణ నెట్‌వర్క్, జూలై 18 : అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ఎన్నో హామీలు ఇచ్చి.. అధికారంలోకి రాగానే విస్మరించిందని ఆశ కార్యకర్తలు భగ్గుమంటున్నారు. ఈ మేరకు గురువారం వారు మంత్రులు, ఎమ్మెల్యేల ఇండ్లను ముట్టడించారు. నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ పట్టణంలోని ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఇంటిని ముట్టడించి పెద్దపెట్టున నినాదాలు చేశారు. నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి క్యాంపు కార్యాలయం ఎదుట బైఠాయించారు. అనంతరం ఎమ్మెల్యేకు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సమర్పించారు. ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి క్యాంపు కార్యాలయం ఎదుట ఆశ కార్యకర్తలు నిరసన తెలిపారు. మంచిర్యాల, చెన్నూరు ఎమ్మెల్యేల ఇళ్ల ముందు ఆశ కార్యకర్తలు ధర్నా చేశారు. ఈ సందర్భంగా పలువురు ఆశ కార్యకర్తలు మాట్లాడుతూ.. తమకు ఫిక్స్‌డ్ వేతనంతోపాటు ప్రమాద బీమా, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోసం వెంటనే ఐఏఎస్ అధికారితో కమిటీ వేయాలని కోరారు.

**ఆశ కార్యకర్తల జీతాలు పెంచాలి: ఎమ్మెల్యే మల్రెడ్డి**

గ్రేటర్ హైదరాబాద్‌లోని బోయిన్‌పల్లిలో మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి క్యాంపు కార్యాలయం వద్ద ఆశ కార్యకర్తలు బైఠాయించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి వారితో మాట్లాడుతూ.. మాతా శిశు సంరక్షణలో ఆశ కార్యకర్తలు నిరంతరం కృషి చేస్తున్నారని కొనియాడారు. మాతృత్వ శిశు మరణాల రేటు గణనీయంగా తగ్గిపోవడానికి ఆశ వర్కర్ల సేవలు అమోఘమని అన్నారు. ప్రస్తుతం ఇస్తున్న జీతాలు సరిపోవడంలేదని, వారి జీతాన్ని కనీసం రూ.18 వేలకు పెంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రానున్న అసెంబ్లీ సమావేశాల్లో ఆశ వర్కర్ల జీతాలతోపాటు వారి సంక్షేమం కోసం ప్రభుత్వం తీసుకోవాల్సిన అంశాలను ప్రస్తావిస్తానని తెలిపారు. ఆశలకు పెడుతున్న పరీక్షలను రద్దుచేయాలని, ఏడాదికి 20 రోజులు జీతంతో కూడిన సెలవులు ఇవ్వాలని ప్రభుత్వానికి సూచించారు. వీరికి ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాలు కల్పించాలని, శ్రమ దోపిడీ చేయవద్దని ప్రభుత్వాన్ని కోరారు.



నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి ఎదుట తమ గోడు వెల్లబోసుకుంటున్న ఆశ కార్యకర్తలు

## • జీతాల కోసం ఎత్తిపోతల పథకం కార్మికుల ధర్నా




ఐదు నెలలుగా పెండింగ్‌లో ఉన్న జీతాలను తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేస్తూ గుత్ప, అలీసాగర్ లిఫ్టు ఇరిగేషన్ కార్మికులు మూడు రోజులుగా సమ్మె చేస్తున్నారు. ఇందులో భాగంగా గురువారం నిజామాబాద్ జిల్లా నవీపేట తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. రెండు ఎత్తిపోతల పథకాల్లో పనిచేసే 120 మందికి ఐదు నెలలుగా జీతాలు లేక పస్తులు ఉంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. జీతాలు చెల్లించకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. - నవీపేట

# బొగ్గు బావులను వేలం వేయొద్దు

## శ్రావణపల్లి బొగ్గు బ్లాకును సింగరేణికి కేటాయించాలి • ఐక్య కార్మిక సంఘాల ఆధ్వర్యంలో చలో రాజ్‌భవన్

ఖైరతాబాద్/కృష్ణకాలనీ, జూలై 18: రాష్ట్రంలోని బొగ్గుబావులను వేలం వేయొద్దని ఐక్య కార్మిక సంఘాల ఆధ్వర్యంలో గురువారం చలో రాజ్‌భవన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఖైరతాబాద్ మీదుగా ర్యాలీగా బయలుదేరగా, మెట్రోస్టేషన్ వద్ద కార్మిక సంఘాల నాయకులను పోలీసులు అరెస్టు చేశారు. బీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు జీ రాంబాబుయాదవ్ మాట్లాడుతూ సింగరేణి నుంచి కేంద్ర, రాష్ట్రాలకు డివిడెంట్స్, పన్నుల రూపంలో ప్రతి సంవత్సరం రూ.8వేల కోట్లు చెల్లిస్తున్నదని తెలిపారు. ఎన్డీఏ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత పదో విడత బొగ్గు బావుల వేలంను ప్రారంభించిందని, తెలంగాణకు చెందిన కిషన్‌రెడ్డికి బొగ్గు గనుల శాఖ కేటాయించి మరీ అమ్మకానికి పెట్టిందని విమర్శించారు. ఇందులో శ్రావణపల్లి బొగ్గు బ్లాకు కూడా వేలం పెట్టడాన్ని ఖండిస్తున్నామని తెలిపారు. బొగ్గు బావులను ప్రైవేటీకరణ చేసి రూ.29వేల కోట్లు సంపాదించాలని కేంద్రం ప్రయత్నిస్తున్నదని, 40వేల మంది పర్మినెంట్, 26వేల కాంట్రాక్ట్ కార్మికులు పనిచేస్తున్న సింగరేణిని ప్రైవేట్‌పరం చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. రాష్ట్రంలోని ప్రతి బొగ్గు బ్లాకు సింగరేణికే దక్కాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టీబీజీకేఎస్ ప్రధాన కార్యదర్శి కృష్ణ, ఉపాధ్యక్షులు గడప రాజయ్య, శ్రీనివాస్, జాఫర్ హుస్సేన్, వెంకటేశ్వర్లు, కిరణ్, సమ్మయ్య, నరేశ్, అవినాశ్ రెడ్డి, సీఐటీయూ నాయకులు బాల్‌రాజ్, సీఐటీయూ నాయకులు పాలడుగు భాస్కర్, హెచ్‌ఎంఎస్ నాయకులు రామారావు, ఐఎఫ్‌టీయూ నాయకుడు సూర్యం పాల్గొన్నారు.



కార్మిక సంఘాల నాయకులను అరెస్టు చేస్తున్న పోలీసులు

**అరెస్టులు ప్రజాస్వామ్య స్ఫూర్తికి విఘాతం: ఎమ్మెల్యే కూనంనేని**

తెలంగాణ బొగ్గు గనులను కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టొద్దని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో నిరసన తెలుపుతున్న నాయకులను అరెస్టు చేయడాన్ని సంఘం గౌరవాధ్యక్షుడు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు తీవ్రంగా ఖండించారు. గురువారం హైదరాబాద్‌లో ఆయన మాట్లాడుతూ.. ఇది ప్రజాస్వామ్య స్ఫూర్తికి విఘాతమని వ్యాఖ్యానించారు. భవిష్యత్‌లో ప్రజాఉద్యమాలను అడ్డుకునే చర్యలకు పాల్పడవద్దని సాంబశివరావు రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

**వేలాన్ని రద్దు చేయాలి: గిరిజన సమాఖ్య**

సింగరేణి బొగ్గు గనుల వేలంపాటను రద్దు చేయాలని తెలంగాణ గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమావత్ అంజయ్యనాయక్ డిమాండ్ చేశారు. గురువారం హైదరాబాద్‌లోని మగ్ధూంభవన్‌లో తెలంగాణ గిరిజన సమాఖ్య రాష్ట్ర కార్యవర్గ సమావేశం సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అజ్మీరా రామ్మూర్తినాయక్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణి సంస్థకే బొగ్గు బ్లాక్‌లను కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సహాయకార్యదర్శి రమేశ్‌నాయక్, శంకర్‌నాయక్, రామ్‌చందర్‌నాయక్, స్వరూపబాయి, రమాదేవి, మాలోత్ శంకర్‌నాయక్, ధీరావత్ లింగానాయక్, లావుడియా దస్రునాయక్, జర్పుల శివనాయక్ (ప్రచండ), చత్రునాయక్, భరత్‌నాయక్ పాల్గొన్నారు.

# అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి

**యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు భారతి**

హైదరాబాద్, జూలై 18 (నమస్తే తెలంగాణ) : తమ సమస్యలను పరిష్కరించాలని అంగన్‌వాడీల యూనియన్ ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు గురువారం స్త్రీ, శిశు సంక్షేమశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ వాకాటి కరుణ, కమిషనర్ కాంతివెస్లీని యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు నల్లా భారతి ఆధ్వర్యంలో కలిసి వినతిపత్రం అందజేశారు. అంగన్‌వాడీ కేంద్రాలను ప్రీ ప్రైమరీ స్కూళ్లుగా నడుపుతున్నందున టీచర్లకు అదనపు పనులు అప్పగించొద్దని, బీఎల్‌వో విధులను రద్దు చేయాలని, 3 నెలల ఏరియర్స్‌తో పాటు పెండింగ్ బిల్లులు చెల్లించాలని కోరారు. సుదీర్ఘకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారికి వాలంటరీ రిటైర్మెంట్ అవకాశం కల్పించాలన్నారు. వినతి పత్రం అందజేసిన వారిలో యూనియన్ ప్రధాన కార్యదర్శి రమాతార, కోశాధికారి వేదవతి, ఎల్లమ్మ, శిరీష, పుష్ప, నాగలక్ష్మి, చిన్నమ్మడు, అనిత ఉన్నారు.



స్త్రీ, శిశు సంక్షేమశాఖ కమిషనర్ కాంతివెస్లీకి వినతిపత్రం అందజేస్తున్న యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు నల్లా భారతి తదితరులు

## కవిత వైద్య పరీక్షలకు కోర్టు అనుమతి

- పరీక్షల నివేదికను అందించాలి: కోర్టు
- కస్టడీ 22 వరకు పొడిగింపు

హైదరాబాద్, జూలై 18 (నమస్తే తెలంగాణ): తీహార్ జైలులో అస్వస్థతకు గురైన బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కవితకు వైద్య పరీక్షలు నిర్వహించేందుకు కోర్టు అనుమతినిచ్చింది. రెండు రోజుల క్రితం అనారోగ్యానికి గురైన కవితను వెంటనే దీన్‌దయాళ్ దవాఖానకు తరలించారు. చికిత్స అనంతరం సాయంత్రానికి కోలుకోవడంతో డిశ్చార్జి చేశారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కవితను కోర్టులో హాజరు పరచగా, తనకు ఎదురవుతున్న అనారోగ్య సమస్యలు, పరీక్ష ఫలితాల్లో వ్యత్యాసాలను న్యాయమూర్తి దృష్టికి కవిత తీసుకెళ్లారు. దీంతో ఢిల్లీ ఎయిమ్స్‌లో వైద్య పరీక్షలు చేయించుకునేందుకు కోర్టు అనుమతినిస్తూ ఆదేశాలు జారీచేసింది. పరీక్షల అనంతరం ఆమె ఆరోగ్యానికి సంబంధించిన నివేదికలను కోర్టుకు అందించాలని న్యాయమూర్తి ఆదేశించారు. మరోవైపు కవిత జ్యుడీషియల్ కస్టడీని ఈ నెల 22 వరకు కోర్టు పొడిగించింది.

# బురద.. బంగారం!

- సేంద్రియ ఎరువుగా వినియోగం
- ప్రభుత్వానికి బోలెడు ఆదాయం
- వెలికితీసే సాంకేతికత అభివృద్ధి
- రైస్‌మిల్లర్ దొరయ్య ఘనత
- టెక్నాలజీకి పేటెంట్ హక్కులూ

హైదరాబాద్ సిటీబ్యూరో, జూలై 18 (నమస్తే తెలంగాణ): బురద అంటే.. అదో బురద. పోయి పోయి ఒంటికి రాసుకుంటామా? అనుకుంటాం. కానీ, ఆ బురద బంగారం అంటున్నారు సుఫల ఎనర్జీ మేనేజింగ్ డైరెక్టర్ దొరయ్య. బురదను సేంద్రియ ఎరువుగా వినియోగించుకోవచ్చని చెప్తున్న ఆయన.. దాన్ని వెలికితీసే సాంకేతికతను అభివృద్ధి చేసి, పేటెంట్లు కూడా సాధించారు. ఒకప్పుడు సాధారణ రైస్‌మిల్లర్ అయిన ఆయన.. ఇంజినీరింగ్ నైపుణ్యాలను జోడించి మురుగునీటి నిర్వహణకు అవసరమైన టెక్నాలజీని అందుబాటులోకి తెచ్చారు.

**తక్కువ ఖర్చుతో పూడికతీత**

చెరువులు, కుంటలు, జలాశయాల్లో భారీగా పేరుకుపోయిన పూడికను చాలా తేలికగా తీసే విధానాన్ని దొరయ్య డెవలప్ చేశారు. తక్కువ విద్యుత్తు వినియోగం, అతి తక్కువ మానవ వనరులతోనే మట్టిని తొలగించొచ్చు. ఈ సాంకేతికత పేరు 'విండ్ మిల్ పవర్డ్ వాటర్ లిఫ్టింగ్ మెకానిజం'. ఈ పద్ధతి పాతకాలంలో బకెట్లను ఉపయోగించి నీటి తోడే విధానం తరహాలోనే ఉంటుంది. కరెంట్ అందుబాటులో లేని కాలంలో బకెట్లను ఉపయోగించి రాట్నం తిప్పుతూ నీటిని తోడే విధానాన్ని ఆధునీకరించి, నీటి అడుగున పేరుకుపోయిన పూడిక తీసేలా డిజైన్ చేశారు. 15-20 అడుగుల ఎత్తులో ఉండే భారీ టవర్లకు బకెట్లను బిగించి, ఆ టవర్లకు కరెంట్ సరఫరా చేయడం వలన తిరుగుతుంది. ఈ సమయంలో నీటి అడుగు భాగంలో అధిక పీడనం కలుగజేస్తే పూడిక పైకి లేచి బకెట్లలోకి చేరుతుంది. ఈ టెక్నాలజీ సాయంతో టన్ను మట్టిని బయటకు తీసేందుకు రూ. 2,500 మాత్రమే ఖర్చు అవుతుందని, సాధారణ పద్ధతిలో బయటకు తీయాలంటే రూ.15-20 వేల ఖర్చు వస్తుందని చెప్తున్నారాయన. ఆ పూడికలో కంపోస్ట్ ఎరువు తరహాలో సేంద్రియ గుణాలు ఉంటాయని, కొంత ప్రాసెస్ చేసి వాడుకోవచ్చని తెలిపారు. ఆ మట్టిని సేంద్రీయ ఎరువుగా ప్రాసెస్ చేసి విక్రయించటం వల్ల ఎరువుల భారం తగ్గడంతో పాటు, రూఫ్ గార్డెన్, ఇంటీరియల్ గార్డెనింగ్‌తో సేంద్రియ ఎరువుల డిమాండ్ తగ్గుతుందని, దీన్ని విక్రయించడం ద్వారా ప్రభుత్వానికి రూ.50 వేల కోట్ల ఆదాయం సమకూరుతుందని వివరించారు. పూడిక తీసిన మట్టితో ఇటుకలు తయారుచేస్తే నిర్మాణరంగానికి అవసరమైన ఇటుకల ఖరీదు భారం తగ్గుతుందని తెలిపారు. ప్రస్తుతం ఒక్క ఎర్ర ఇటుక తయారీకి రూ.3-5 ఖర్చు అవుతుండగా, పూడిక మట్టిని వినియోగిస్తే 60-80 పైసలే ఖర్చు అవుతుందని, ఒక్కో ఇటుకను రూ.3-5కే విక్రయించే వీలు ఉంటుందని వెల్లడించారు.



**పట్టించుకోని అధికారులు**

జాతీయ స్థాయిలో తన టెక్నాలజీకి పేటెంట్ ఉన్నా వీటిని అమలు చేయడం విషయంలో ఇప్పటికీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని దొరయ్య అంటున్నారు. ఏపీ, తెలంగాణ, కర్ణాటక అధికారులు, ప్రజాప్రతినిధులకు తన ప్రాజెక్టు గురించి వివరించానని తెలిపారు. మంత్రులు, ముఖ్యమంత్రుల కార్యాలయాల నుంచి స్పందన వస్తున్నా, క్షేత్రస్థాయి సిబ్బంది పట్టించుకోవటం లేదని వాపోయారు. గత ఏడాది కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్‌ను కలిసి వివరించానని, పైలట్ ప్రాజెక్టులో ప్రారంభించేందుకు సూత్రప్రాయంగా అనుమతించారని వివరించారు. సీఎం రేవంత్ రెడ్డి కూడా దీనిపై ఆసక్తి చూపినా.. హెచ్‌ఎండీఏ, వాటర్‌బోర్డు అధికారులు ఆసక్తి చూపటం లేదని పేర్కొన్నారు.

## కొడుకుల వద్దకు చేరిన తల్లి

**కొడుకులకు తహసీల్దార్ కౌన్సెలింగ్**

గార్ల, జూలై 18: కలెక్టర్ చొరవతో వృద్ధాప్యంలో ఉన్న తల్లి కొడుకుల వద్దకు చేరింది. కొడుకులు తల్లిని గెంటేయడంపై ఈ నెల 17న 'నమస్తే తెలంగాణ'లో ప్రచురితమైన 'అమ్మను కొట్టి గెంటేశారు' కథనానికి కలెక్టర్ స్పందించారు. చర్యలు తీసుకోవాలని ఈ మేరకు రెవెన్యూ, పోలీస్ అధికారులను ఆదేశించారు. గురువారం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ రవీందర్, సీఐ రవికుమార్, ఎస్సై జీనత్ కుమార్ సమక్షంలో వృద్ధురాలు గాడేపల్లి నర్సమ్మ కొడుకులు శ్రీనివాస్, కృష్ణకు కౌన్సెలింగ్ ఇచ్చారు. తప్పు తెలుసుకున్న కుమారులు తల్లికి ఎలాంటి లోటులేకుండా చూసుకుంటామని హామీ ఇచ్చారు. భవిష్యత్‌లో ఎలాంటి సమస్యలు రాకుండాచూసుకుంటామని వారు పేర్కొన్నారు. అనంతరం తల్లిని ఇంటికి తీసుకెళ్లారు.



తల్లీ కొడుకులకు కౌన్సెలింగ్ ఇస్తున్న తహసీల్దార్, పోలీస్ అధికారులు

**నమస్తే ఎఫెక్ట్**

## నలుగురు వైద్యులకు మెమోలు

వరంగల్ చౌరస్తా, జూలై 18: రోగులకు వైద్యసేవలు అందించడంలో అలసత్వాన్ని ప్రదర్శించి విధులకు ఆలస్యంగా హాజరైన వరంగల్ కాకతీయ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ న్యూరాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్లు నలుగురికి ఎంజీఎం సూపరింటెండెంట్ డాక్టర్ చంద్రశేఖర్ మెమోలు జారీ చేశారు. వైద్యులు సకాలంలో విధులకు హాజరుకావడం లేదని ఈ నెల 17న 'నమస్తే తెలంగాణ'లో ప్రచురితమైన 'వైద్యుల కోసం రోగుల పడిగాపులు' కథనానికి వైద్యాధికారులు స్పందించారు. న్యూరాలజీ విభాగం అసిస్టెంట్ వినయ్‌కుమార్, డాక్టర్ గౌతమ్, డాక్టర్ మానస, డాక్టర్ నవీన్‌కు మెమోలు జారీ చేస్తూ 24 గంటల్లో వివరణ ఇవ్వాలని ఆదేశించారు. హాస్పిటల్‌లో అన్ని విభాగాల పరిస్థితి ఇలాగే ఉన్నా ఒక్క విభాగానికి చెందిన వైద్యులకే మెమోలు జారీ చేయడాన్ని పలువురు వైద్యులు తప్పుబడుతున్నారు.